

సాక్షి పల్నాడు

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9635 టీఎంసీలు. ఎగువ నుంచి 6,709 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1179 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

'నవోదయం'కు 402 మంది హాజరు



నరసరావుపేట: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు మంగళవారం డీఆర్వో వినాయకం అధ్యక్షతన నిర్వహించిన నవోదయం కార్యక్రమానికి 402 మంది ఎస్సీలు హాజరయ్యారు. ఉపాధి కల్పన, పరిశ్రమల ఏర్పాటుకు ఆర్థిక సహకారం, బ్యాంకుల నుంచి రుణాలు కావాలంటూ అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ పీడీ ఓబుల్ నాయుడు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

18న ఏలేశ్వరస్వామి గుట్టకు లాంచీ సర్వీసులు

పర్యాటక శాఖ మేనేజర్ భైరవస్వామి




విజయపురిసౌత్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీ ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అనుపు నుంచి ఏలేశ్వరస్వామి గుట్ట (మల్లయ్య గట్టు)కు ప్రత్యేక లాంచీ సర్వీసు తిప్పేందుకు ఏర్పాట్లు చేసినట్లు స్థానిక లాంచీస్టేషన్ మేనేజర్ భైరవస్వామి మంగళవారం తెలిపారు. ఆయన మంగళవారం విలేకరలతో మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లాంచీ సర్వీసులు అనుపు నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. అనుపు నుంచి ఏలేశ్వరగట్టుకు వెళ్లేందుకు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 టిక్కెట్ ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అనుపులో అన్ని ఏర్పాట్లను చేశామని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 97051 88311ను సంప్రదించాలన్నారు. ఆయన వెంట వినయతుల్లా, సిబ్బంది ఉన్నారు.

యార్డుకు 1,40,104 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,40,104 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,37,168 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,000 వరకు దక్కింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 94,377 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 557.50 అడుగుల వద్ద ఉంది. ఇది 226.6060 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,104, ఎడమ కాలువకు 8,986 ఎస్ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 20,520 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,520 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 833.60 అడుగుల వద్ద ఉంది. ఇది 53.3713 టీఎంసీలకు సమానం.

మ్యాపింగ్‌కు శ్రీకారం.. సంక్షేమ ఉపకారం

కుటుంబ మ్యాపింగ్ సవరణకు అవకాశం

- సంక్షేమ పథకాలకు కుటుంబ మ్యాపింగ్ కీలకం
- మార్పులు, చేర్పులకు సచివాలయాల్లో సంప్రదించాలి

సత్తెనపల్లి: సంక్షేమ పథకాలకు కీలకమైన కుటుంబ మ్యాపింగ్ (హౌస్ హోల్డ్ మ్యాపింగ్) లో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కుమారుడు, కుమార్తె వివాహమై వేరుగా ఉంటున్నా, తల్లిదండ్రులతో పాటు వారినీ ఒకే కుటుంబంగా భావిస్తూ ఇప్పటి వరకు పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వం ఆరంచెల విచారణలో భాగంగా కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరి పేరున ఆస్తులు, వాహనాలున్నాయన్న కారణాలతో కొందరిని పథకాలకు అనర్హులుగా ప్రకటించింది. అలాంటి వారందరికీ ఊరటనిచ్చేలా సవరణలకు అవకాశం కల్పిస్తూ సచివాలయాలకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

2019లో సర్వే..

గతంలో ప్రజా సాధికార సర్వే పేరుతో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సర్వే చేసి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి, వారంతా ఓ కుటుంబంలా నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో కుటుంబ మ్యాపింగ్ విధానాన్ని పాటిస్తోంది. దాని



పట్టణంలోని సచివాలయంలో మ్యాపింగ్ నిర్వహిస్తున్న ఉద్యోగి

ఆధారంగానే పింఛను, వైఎస్సార్ చేయూత, విద్యా, వసతి దీవెన, ఆసరా, అమ్మఒడి, వాహన మిత్ర తదితరాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. కుమారుడు, కుమార్తెలకు పెళ్లిళ్లయి వేర్వేరుగా ఉంటూ రేషన్ కార్డులు విడివిడిగా ఉన్నా, వారంతా ఒకే ఇంట్లో నివాసం ఉండటంతో ఒకే కుటుంబంగా మ్యాపింగ్ చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులనూ ఆయా కుటుంబాల్లోనే కలిపారు. ఆ తర్వాత మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వకపోవడంతో సమస్యలు మొదలయ్యాయి. కుటుంబ సభ్యుల పేరుతో నాలుగు చక్రాల వాహనం ఉందని, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని, ఇంటి స్థలం ఎక్కువ, విద్యుత్ బిల్లు అధికంగా వినియోగిస్తున్నారంటూ కుటుంబంలో సంక్షేమ పథకాలు పొందుతున్న వారిని అనర్హులుగా ప్రకటించి లబ్ధి నిలిపి వేశారు. కొత్తగా ఉద్యోగాలు సాధించిన సచివాలయ ఉద్యోగుల తల్లిదండ్రులకూ సమస్యలు వచ్చాయి. ఈ క్రమంలో మ్యాపింగ్‌లో సవరణలకు అవకాశం కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారు.

చాలా మందికి ప్రయోజనం

జిల్లాలో సచివాలయ ఉద్యోగులకు అధిక శాతం వివాహాలై వేరుగా ఉంటున్నా వారి తల్లిదండ్రులు, సోదరులకు పథకాలు నిలిచిపోయాయి. కుమార్తెకు పెళ్లయి అత్తవారింటికి వెళ్లినా తల్లిదండ్రులకు రేషన్ కార్డ్, పింఛన్లు నిలిచిపోయాయి. అలాంటి వారు ప్రస్తుతం భర్త కుటుంబంలో మ్యాపింగ్ చేయించుకునే అవకాశంతో పాటు దస్త్రాలపరంగా తల్లిదండ్రుల కుటుంబం నుంచి బయటకు వచ్చే అవకాశం లభించింది. ప్రస్తుత సవరణల వల్ల పల్నాడు జిల్లా వ్యాప్తంగా సుమారు 12 వేల కుటుంబాలకు పైగా మేలు జరగనుంది.

సచివాలయాలను సంప్రదించాలి..

లబ్ధిదారుల ఎంపికకు కుటుంబం మ్యాపింగ్ కీలకం. కుటుంబం మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు సచివాలయాలను సంప్రదించాలి. వివాహమైన వారు భర్త కుటుంబంలోకి వెళ్లాలన్నా, నేరుగా మ్యాపింగ్ చేయించుకోవాలన్నా వివాహ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ప్రభుత్వం సూచించిన ఆరు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించి సవరణలు చేయించుకోవాలి.

ఘనంగా ధ్యానబుద్ధవనం ప్రారంభోత్సవం



రావి మొక్కను నాటుతున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, ఆర్కే రోజా, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: బుద్ధిస్ట్ సర్క్యూట్‌లో భాగంగా స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా అమరావతిలో నిర్మించిన ధ్యానబుద్ధవనాన్ని మంగళవారం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. తొలుత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. మంత్రులకు స్థానిక శాసన సభ్యుడు నంబూరు శంకరరావు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. మంత్రులిద్దరూ అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులకు ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటంతో పాటుగా తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ధ్యానబుద్ధ విగ్రహం వద్ద బుద్ధుడి విగ్రహానికి పూజలు చేసి ధ్యానబుద్ధవనంలో ఆడిటోరియం, ధ్యాన మందిరం, లేజర్‌షో, ఫుడ్ కోర్టుతో పాటుగా ఇంటర్‌ప్రిడిక్షన్ సెంటర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. తామ్ర ఫలకాన్ని ఆవిష్కరించారు. ధ్యానబుద్ధవనం ఆవరణలో రావి మొక్కను నాటారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్థానిక పురావస్తు సంగ్రహానశాలను సందర్శించి అక్కడ బౌద్ధమత విశిష్టతను తెలిపే శిల్పాలను తిలకించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ, ఏఎస్ఐ అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరునాళ్లను విజయవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- కోటప్పకొండ తిరునాళ్లపై సమీక్ష
- ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జేసీ శ్యామ్‌ప్రసాద్, వేదికపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ బింధుమాదవ్

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్లను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై ఆయన మంగళవారం ఆలయ ప్రాంగణంలో మూడవ సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ బిందు మాధవ్ పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో తిరునాళ్లకు చేపడుతున్న ఏర్పాట్లపై సమావేశంలో సమీక్షించారు. ప్రధానంగా ట్రాఫిక్, పారిశుద్ధ్యం, క్యూలైన్‌లు, తాగునీరు తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. తిరునాళ్ల కోసం ఏపీఎస్ఆర్టీసీ 535 బస్సులను నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. కోటప్పకొండకు నరసరావుపేట నుంచి 185 బస్సులు, చిలకలూరిపేట నుంచి 135, ఒంగోలు, వినుకొండ తదితర ప్రాంతాల నుంచి కూడా బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కొండ దిగువ నుంచి పైభాగానికి ప్రయాణికులను చేరవేసేందుకు 20 సప్తగిరి బస్సులను వినియోగిస్తామని వెల్లడించారు. యాత్రికులకు వైద్య సేవలు అందించేందుకు తొమ్మిది చోట్ల ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ శోభారాణి తెలిపారు. 108, 104 వాహనాలతో పాటు నరసరావుపేట, చిలకలూరిపేటల్లో అత్యవసర చికిత్స కోసం వైద్యులను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీ నుంచి నిరంతరాయంగా కోటప్పకొండలో విద్యుత్ సరఫరా ఉండేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తిరునాళ్ల జరిగే కొండ దిగువ భాగంలో పారిశుద్ధ్య కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు డీపీవో విజయభాస్కరరెడ్డి తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్స్ తదితర అంశాలను పర్యవేక్షించాలని జెడ్పీ సీఈవోను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో 2 లక్షల వాటర్ ప్యాకెట్స్ సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో భక్తులకు తాగునీరు, మజ్జిగను పంపిణీ చేయాలని జేసీ సూచించారు.

యాత్రికులు సహకరించాలి

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరునాళ్లలో ప్రధానమైన ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించినట్లు తెలిపారు. ట్రాఫిక్ అవరోధాలు లేకుండా విజయవంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యాత్రికులు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలని కోరారు. అడిషనల్ ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ కోటప్పకొండ పార్కింగ్ పేరుతో ప్రత్యేక యాప్‌ను పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. తిరునాళ్లకు బయలుదేరేముందే యాప్ ద్వారా ఖాళీగా ఉన్న పార్కింగ్ స్థలాలను గుర్తించి అక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

25 లక్షల మంది వస్తారని అంచనా

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది తిరునాళ్లకు 25 లక్షల మంది యాత్రికులు వస్తారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం దర్శనానికి భక్తులు అధికంగా వస్తారని, సాయంత్రం 4 గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు కొండ దిగువున తిరునాళ్ల ప్రాంతంలో రద్దీ ఉంటుందన్నారు. రెండు అంశాలను అధికారులు గుర్తించి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, డీఆర్‌ఓ వినాయకం, డీఎఫ్‌ఓ రామచంద్రరావు, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, ఆలయ ఈవో వేమూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిసెల నిర్మాణానికి సహకరించండి

- పర్యావరణ, అటవీ శాఖ అనుమతులకు క్లియరెన్స్ ఇవ్వండి
- ఈ ప్రాజెక్టు పల్నాడు వాసుల ఏడు దశాబ్దాల కల
- కేంద్ర అటవీశాఖ ఏడీజీ బివాష్ రంజన్‌ను అభ్యర్థించిన ఎంపీ లావు



ఢిల్లీలో ఏడీజీ బివాష్ రంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ లావు

నరసరావుపేట: ఏడు దశాబ్దాల పల్నాడు వాసుల కల, అతిపెద్ద నీటి ప్రాజెక్టు వరికపూడిసెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించి కావాల్సిన అనుమతులు జారీ చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలో ఏడీజీ (అడిషనల్ డైరెక్టర్ జనరల్) బివాష్ రంజన్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభ్యర్థించారు. మంగళవారం ఢిల్లీలో బివాష్ రంజన్‌ను ఎంపీ కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి క్లియరెన్స్‌లు పొందడానికి అవసరమైన డీపీఆర్ సహా అన్నీ ప్రక్రియలను పూర్తి చేసిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో ముఖ్య భాగాలైన పంప్‌హౌస్, ప్రెజర్ మెయిన్, బ్రేక్ ప్రెజర్ ట్యాంక్, ఇతర నిర్మాణాలు చేపట్టడానికి కావాల్సిన భూమి అటవీ ప్రాంతంలో ఉందన్నారు. ఇది రాజీవ్ గాంధీ వన్యప్రాణుల అభయారణ్యం, నాగార్జునసాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యంలోని ప్రధాన ప్రాంతమని వెల్లడించారు. 19.13 హెక్టార్ల భూమి మళ్లింపును వేగవంతం చేయాలని విన్నవించారు. జిల్లాలోని వెల్దుర్తి మండలం గంగులకుంట గ్రామం సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మించాల్సిఉందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే భారీ ఎత్తున సాగు, తాగునీటి సమస్య తీరుతుందని విజ్ఞప్తి చేశారు.

భృంగి వాహనంపై ఊరేగిన మల్లేశ్వరుడు



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు మల్లేశ్వరుని దర్శించుకుని హారతులిచ్చారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన స్వామి వారి గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా శాసన స్తంభం, పూల మార్కెట్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి పెద కోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరింది. నగరానికి చెందిన మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, కృష్ణకుమారి దంపతులు, ఎల్‌కే శర్మ, ఇందిరాదేవి దంపతులు భృంగి వాహన ఉత్సవానికి కైంకర్యపరులుగా వ్యవహరించగా దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

కాలచక్ర మ్యూజియంను సందర్శించిన కలెక్టర్

అమరావతి: అమరావతిలోని కాలచక్ర మ్యూజియంను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్ శివశంకర్ మంగళవారం సందర్శించారు. మ్యూజియంలోని అన్ని విభాగాలను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మ్యూజియం మూతపడటానికి కారణాలు, తిరిగి వినియోగంలోకి తేవాలంటే తీసుకోవాల్సిన చర్యలపై పర్యాటకశాఖ సాంకేతిక అధికారులతో చర్చించారు. మ్యూజియం ఆవరణలో మద్యం దుకాణం ఉండటాన్ని గుర్తించిన కలెక్టర్ ఎక్సైజ్ ఉన్నతాధికారులతో మాట్లాడి దుకాణాన్ని వేరే చోటికి మార్చటానికి కృషి చేస్తానన్నారు. మ్యూజియంను యాత్రికులు సందర్శించే విధంగా తయారుచేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర మ్యూజియం డైరెక్టర్ వాణీమోహన్‌తో చర్చిస్తామన్నారు. మరో రెండు వారాలలో పర్యాటకశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట పర్యాటకశాఖ ఈఈ శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.



కాలచక్ర మ్యూజియంను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

పోలీసులకు ద్విచక్ర వాహనాలు ఎంతో ఉపయోగకరం

- జిల్లా పోలీసు విభాగానికి 20 వాహనాలు అందజేసిన తిరుపతి హీరో కంపెనీ
- పరిశీలించి ప్రారంభించిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పోలీస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ద్విచక్రవాహనాలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తిరుపతి హీరో మోటార్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ జిల్లా పోలీసు విభాగానికి ఉదారంగా అందజేసిన 20 ద్విచక్రవాహనాలను పరిశీలించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలను అందించినందుకు హీరో మోటార్ కార్పొరేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవలో తమవంతు బాధ్యతగా ముందుకు రావటం సంతోషకరమైన విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలతో సమాజం పట్ల తమకున్న బాధ్యతను హీరో మోటార్ కార్పొరేషన్ సంస్థ చాటుకోవాలని మన స్ఫూర్తిగా కోరుతున్నామన్నారు. ఈ వాహనాల ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించడానికి మా పోలీసులు కృషి చేస్తారని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, డీఎస్పీ చిన్నికృష్ణ, జిల్లా పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్టు ఆర్ఐ రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ బిందుమాధవ్

బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి

జిల్లా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం, నిత్యావసరాలు పేదలకు అందజేసే ఎండీయూ వాహనాలపై డిప్యూటీ తహసీల్దార్లు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకధరల దుకాణాలకు సకాలంలో బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ జరిగేలా, ఎండీయు ఆపరేటర్లు ఇళ్లకు వెళ్లి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ రవాణా, నిల్వలను గుర్తించి సీజ్‌చేసే సమయంలో పూర్తి విచారణ చేసి వాంగ్మూలాలను నమోదు చేయాలన్నారు. పౌర సరఫరాలు, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు ఒక టీమ్‌గా ఏర్పడి ఆహార కల్తీలపై దాడులు నిర్వహిస్తూ కల్తీలను నియంత్రించాలన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై దృష్టిసారిస్తూ దాడులు నిర్వహించాలన్నారు. రైస్‌మిల్లులు ఇవ్వాల్సిన సీఎంఆర్ రైస్‌ను నిర్ణీత సమయంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి జి.మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ జి.వరలక్ష్మి, తూనికలు, కొలతల శాఖ అధికారి అల్లూరయ్య, సివిల్ సప్లయిస్ డెప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రకృతి వ్యవసాయ పంటలకు 15 శాతం అధిక ధరలు

నరసరావుపేట: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలకు మార్కెట్ ధర కన్నా 15 శాతం అధికంగా ధరలు చెల్లించి కొనుగోలు చేయడానికి మార్క్‌ఫెడ్, రైతు సాధికార సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానంలతో ఎంవోయూ చేసుకున్నట్లు జిల్లా ప్రైస్ కమిటీ అధ్యక్షుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా స్థాయి ప్రైస్ కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన శెనగపంట క్వింటాలుకు రూ.6,325, కంది క్వింటాల్‌కు రూ.7,590 చొప్పున కొనుగోలు చేసేందుకు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి మాట్లాడుతూ జిల్లాలోని చిలకలూరిపేట మండలంలో శనగ పంట పండిస్తున్న 11 మంది రైతులు 95 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగుచేసిన శనగను పరీక్షించగా పురుగుమందుల అవశేషాలు లేవని, ఆ పంటను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. బొల్లాపల్లి, ఈపూరు, పిడుగురాళ్ల, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాల్లో మొత్తం 112 మంది రైతులు 305 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరించి కంది పంట పండిస్తున్నారని, ఆ పంటలో కూడా పురుగు మందుల అవశేషాలు లేవని ధ్రువీకరించారన్నారు. మార్కెట్ ధర కన్నా ప్రభుత్వం నిర్ణయించిన 15శాతం అధిక ధరకు కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, డీఎస్‌వో మోహన్‌రావు, జిల్లా పౌరసరఫరాలశాఖ డిపో మేనేజర్ జి.వరలక్ష్మి, జిల్లాస్థాయి ప్రైస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బంగారం మాయంలో రుణగ్రహీతలకు హామీ పత్రాలు

సత్తెనపల్లి: బంగారం మాయంలో రుణ గ్రహీతలందరికీ ఎట్టకేలకు బ్యాంక్ అధికారులు హామీ పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఇటీవల బ్యాంక్ మేనేజర్, గోల్డ్ అప్రైజర్ కలిసి బంగారం మాయం చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో వారిరువురిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం 43 మంది రుణగ్రహీతలకు చెందిన 3149.42 గ్రాముల బంగారం మాయం కాగా దాని విలువ రూ.1.52 కోట్లుగా ఉంది. బంగారం మాయం కావడంపై రైతులు పలు విధాలుగా ఆందోళనలు చేపట్టారు. దీంతో బ్యాంక్ అధికారులు స్పందించి 43 మంది బంగారం రుణ గ్రహీతలకు బంగారం స్థూల బరువుపై 9 శాతం మేకింగ్ చార్జీలు, మూడు శాతం జీఎస్టీ కలిపి పరిహారం చెల్లించడానికి అంగీకరించి హామీ పత్రాలను అందించారు. 40 పని దినాలలో ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం అవసరమైన పత్రాలు పొందిన తర్వాత ఈ నెల 14 నుంచి క్లెయిమ్‌దారు, రుణ గ్రహీత రుణ ఖాతాలో ఏదైనా బకాయి ఉంటే ఆ మొత్తాన్ని బ్యాలెన్స్‌కి సర్దుబాటు చేసే హక్కు బ్యాంకుకు ఉన్నట్లు పేర్కొన్నారు. 43 మంది రైతులకు హామీ పత్రాలను అందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చినగంజాం: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మంగళవారం ఇంకొల్లు మండలం ఇడుపులుపాడులో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన గుంజి వీరాస్వామి(35) 12 ఏళ్ల క్రితం ద్రోణాదుల గ్రామానికి చెందిన లక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల రోజుల నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలతో విడిగా ఉంటున్నారు. ఇంట్లో ఉరేసుకొని ఉండడంతో తండ్రి గుంజి నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

సైకిల్ వ్యాయామంతో క్యాన్సర్ వ్యాధి నివారణ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు

పెదకాకాని: ప్రతి రోజూ సైకిల్ తొక్కి వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు అన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళాలో భాగంగా సైకిల్ ఫర్ హెల్త్ పేరిట పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ప్రధానసెంటర్ మీదుగా మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పెదకాకాని పీహెచ్‌సీ వైద్యాధికారి నారాయణస్వామి అధ్యక్షత వహించారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సైకిల్ వ్యాయామంతో క్యాన్సర్ వ్యాధి తగ్గుతుందనే అంశంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సైకిల్ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. సైకిల్ వ్యాయామం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి చైతన్యపర్చనున్నట్లు తెలిపారు. సైకిల్ వ్యాయామం అలవాటు చేయడం ద్వారా మన దేశంలోనూ క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి జయప్రసాద్, డాక్టర్‌లు అన్నపూర్ణ, లక్ష్మానాయక్, జె.నారాయణస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుట్ట దుర్గ, ఏఎస్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి

ఘనంగా నిత్యసహాయమాత దేవాలయ ప్రతిష్ట మహోత్సవం

ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన గుంటూరు పీఠాధిపతులు భాగ్యయ్య

మాచర్ల: పట్టణంలోని కేసీపీ అతిథి గృహానికి వెళ్లే ప్రాంతంలో వేంచేసియున్న నిత్య సహాయ మాత నూతన దేవాలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా జరిపారు. అందులో భాగంగా గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిని భాగ్యయ్యతోపాటు పలువురు పాస్టర్లు తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. భాగ్యయ్య దివ్య సమష్టి బలి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. నిత్య సహాయ మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చర్చిని ప్రారంభించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే పీఆర్కే తన సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని చెప్పారు. నూతనంగా చర్చి నిర్మాణానికి కారకులైన భాగ్యయ్య, స్థానిక పాస్టర్ రఫేల్‌రెడ్డిని సత్కరించి అభినందించారు. వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు చర్చి పెద్దలు పాల్గొన్నారు.



బిషప్ భాగ్యయ్యను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ పిఆర్కే

ఫ్యాక్టరీలలో ప్రమాదాలపై 23న మాక్ డ్రిల్

డీఆర్వో చంద్రశేఖరరావు

గుంటూరువెస్ట్: పరిశ్రమల్లో విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు, భారీ, అతి భారీ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 23న మాక్ డ్రిల్ నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ మాక్ డ్రిల్ రోజునే జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో దీనిని చేపట్టాలన్నారు. భారీ పేలుడు జరిగినప్పుడు, ప్రాణాంతక గ్యాస్ లీకైనప్పుడు, ఇతర ప్రమాదాలు ఏర్పడినప్పుడు కార్మికులకు ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ఎలా బయటపడాలో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వేసవి ప్రారంభమైందన్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరిగే అవకాశముందని చెప్పారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ శివకుమార్‌రెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ అస్లాం ఉన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో చంద్రశేఖరరావు

కుడికాలువలో యువకుడు గల్లంతు

మాచర్లరూరల్/విజయపురిసౌత్: మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామ సమీపంలోని కుడి కాలువ వద్ద యువకుడు స్నానం చేస్తుండగా గల్లంతైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విజయపురిసౌత్ పోలీసుల కథనం ప్రకారం.. మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన షేక్ బాషా(27) తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ముగ్గురు స్నేహితులతో కలిసి నాగార్జునసాగర్‌లో ఫంక్షన్‌కు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. నలుగురు యువకులు తాళ్లపల్లి వద్ద చేరుకొని కాలువలో స్నానానికి దిగారు. బాషా గల్లంతయ్యాడు. విషయాన్ని స్నేహితులు బాషా తండ్రి ఖాదర్‌వలి, తల్లి షకీలాకు సమాచారం అందించారు. బంధువులు కాలువలో బాషా ఆచూకీ కోసం వెతికిన కనిపించలేదు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాషా తల్లి షకీలా విజయపురిసౌత్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ బాషా (ఫైల్)

రేపు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశం

బాపట్ల టౌన్: బాపట్ల, అద్దంకి బస్టాండ్‌ల్లో గురువారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా బస్టాండ్‌లను వాణిజ్య, వ్యాపార ప్రాతిపదికన, పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలు ఉదయం 11 గంటలకు అద్దంకి డిపో, సాయంత్రం 4 గంటలకు బాపట్ల ఆర్టీసీ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

రాంబాబును పరామర్శించిన ఐజీ త్రివిక్రమవర్మ

గుంటూరుఈస్ట్: రోడ్డు ప్రమాదంలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సైకిలిస్టును ఐజీ త్రివిక్రమవర్మ మంగళవారం పరామర్శించారు. వసంతరాయపురానికి చెందిన బండి రాంబాబు మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా జీవనం సాగిస్తుంటాడు. ఆరోగ్యం కోసం నిత్యం సైకిల్ తొక్కుతుంటాడు. ఈనెల 12వ తేదీ అమరావతి రోడ్డులోని హోసన్న మందిరం వద్ద లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు ఐజీ త్రివిక్రమవర్మ రాంబాబును పలకరించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్య అధికారులను ఏ మేరకు వైద్యం అందుతుంది అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ ఈ ఘటన బాధాకరమన్నారు. ఘటనపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనం సీజ్ చేయడం జరిగిందన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుని రాంబాబు కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. వైద్యులు సకాలంలో స్పందించి మంచి వైద్యం అందించారని ప్రశంసించారు. తాను సైక్లిస్టు అసోసియేషన్ తరుపున బాధిత కుటుంబానికి తనవంతుగా రూ.10వేలు ఆర్థిక సహాయం ఇస్తున్నట్లు తెలిపారు. సైక్లిస్టు అసోసియేషన్ సభ్యుడు బండ్లమూడి సుబ్బయ్య మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరుపున రాంబాబు కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అసోసియేషన్ సభ్యుల నుంచి చందాలు వసూలు చేసి తగిన సహాయం ఆ కుటుంబానికి అందజేస్తామని తెలిపారు. కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని అసోసియేషన్ సభ్యులు సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, ఆర్ఎంఓ సతీష్, వైద్య సిబ్బంది ఉన్నారు.



రాంబాబును, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐజీ త్రివిక్రమ వర్మ

బంగారు ఆభరణాలు గంటల వ్యవధిలో స్వాధీనం

- 13 సవర్ల బంగారు ఆభరణాలు అందజేత
- హర్షం వ్యక్తం చేసిన బాధిత మహిళ

బాపట్ల టౌన్: బంగారు ఆభరణాలు ఉన్న పర్సును మహిళ పోగొట్టుకున్న గంటల వ్యవధిలోనే పోలీసులు స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించారు. వివరాలు.. పర్చూరుకు చెందిన వస్త్రాల వ్యాపారి బుర్ర మహాలక్ష్మి సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మందులు కొనుగోలు చేసేందుకు పర్చూరులోని శ్రీనివాస మెడికల్ దుకాణానికి వెళ్లారు. మందులు కొనుగోలు చేసే సమయంలో చేతిలో ఉన్న పర్సును మరిచిపోయారు. ఇంటికెళ్లి చూసిన తర్వాత పర్సు కనిపించకపోవడంతో వెంటనే సదరు మెడికల్ దుకాణానికి వెళ్లారు. అక్కడ కనిపించకపోవడంతో పర్చూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎస్ఐ చెంచుప్రసాద్ సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా 70 సంవత్సరాలు వయసు కలిగిన వృద్ధుడు షాపులోని పర్సును తీసుకున్నట్లు గుర్తించారు. అతడి గురించి ఆరా తీయగా ఉప్పుటూరు గ్రామానికి చెందిన షేక్ మౌలాలీగా నిర్ధారించారు. వెంటనే అతడి ఇంటికి వెళ్లి అతని వద్ద నుంచి పర్సును స్వాధీనం చేసుకున్నారు. అందులో నాలుగు బంగారు గాజులు, రెండుపేటల గొలుసు, ఒక ఉంగరం, నల్లపూసల గొలుసు మొత్తం 13 సవర్ల బంగారపు ఆభరణాలు, రూ. 13,200 ఉన్నాయి. గంట వ్యవధిలోనే పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు, నగదును తిరిగి తనకు అప్పగించిన పోలీసులకు రుణపడి ఉంటానని బాధిత తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ పర్చూరు ఎస్ఐ చెంచు ప్రసాద్‌ను ఫోన్‌లో అభినందించారు.



బాధిత మహిళకు బంగారు ఆభరణాలను అందజేస్తున్న పర్చూరు ఎస్ఐ

పురపరిపాలనా శాఖ - పిడుగురాళ్ళ పురపాలక సంఘం

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

సుమారు రూ.9.57లక్షల విలువగల కెం.ఇ పనులకు టెండరు ఐ.డి.నెంబర్లు 595165, 595174, 595186 తేది.15-02-2023న "మునిసిపల్ జనరల్ ఫండ్స్" క్రింద టెండర్లు ఆహ్వానించబడినవి. పూర్తి వివరములు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నందు చూడగలరు. టెండరు దాఖలు చేయుటకు చివరి తేది. 22-02-2023

సం/- కమీషనరు, పిడుగురాళ్ళ పురపాలక సంఘము

శ్రీ యడవల్లి వారి ధర్మసత్రం

(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ కార్పొరేషన్ వారి అనుబంధ సంస్థ)

కొత్తపేట, గుంటూరు, గుంటూరు జిల్లా.

సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

శ్రీ యడవల్లి వారి ధర్మసత్రము, కొత్తపేట, గుంటూరుకు సంబంధించిన టాలీవుడ్ థియేటరు భవనము పూర్తిగా తొలగించి అందులో గల కలప, ఇనుము, బిల్డింగ్ మెటీరియల్ Dismantling Charges క్రింద తీసుకొని, సంస్థకు ఎంత మొత్తము చెల్లింపు చేయగలరు అనే విషయంపై సీల్డ్ టెండర్లు కమ్ బహిరంగ వేలం జరుపబడును. శ్రీయుత కమీషనర్, యడవల్లి వారి ధర్మసత్రం వారి కార్యాలయంలో టెండర్లు తెరువబడును మరియు బహిరంగ వేలం అదే రోజు శ్రీయుత కమీషనర్, శ్రీ యడవల్లి వారి ధర్మసత్రం, కొత్తపేట, గుంటూరు వారి కార్యాలయము నందు ది.25-02-2023 న ఉదయం 11-00 గంటలకు జరుగును. ఆసక్తి ఉన్న వారు రూ.50,000/-లు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను.

ఇట్లు కమీషనర్

ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్

(రిజిస్టర్డ్ అండర్ ఏ.పి. మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ Act.1995) Regd.No.431

ప్రధాన కార్యాలయము : 3వ లైను, బ్రాడీపేట, గుంటూరు-2.ఫోన్ : (0863) 2354847

ప్రత్యేక మహాజన సభ నోటీసు

ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, గుంటూరు యొక్క ప్రత్యేక మహాజన సభ ఈ దిగువ అంశములు చర్చించి తీర్మానించుటకు గాను ది.19-03-2023 ఆదివారము ఉదయం 9.00 గంటలకు ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్,(మూడవ అంతస్తు), 3వ లైను, బ్రాడీపేట, గుంటూరు నందు జరుపబడును. కావున ఈ ప్రత్యేక మహాజనసభకు బ్యాంకు నందు "A" తరగతి సభ్యులందరూ హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఆ రోజు కోరము కాని యెడల ప్రత్యేక మహాజన సభ ది.26-03-2023 ఆదివారము ఉ॥ 9.00 గంటలకు ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్,(మూడవ అంతస్తు), 3వ లైను, బ్రాడీపేట, గుంటూరు నందు జరుపబడును.

అంశములు

1) బైలా నం. 10(ఎ), 31(బి), 37(ఎ), 41(ఎ) లను సవరణ చేయుట గురించి.
2) బైలా నం. 44(బి) ను నూతనముగా జత చేయుట గురించి.
3) చైర్మన్ గారి అనుమతితో ప్రవేశపెట్టబడు ఇతర విషయములు.

పాలకవర్గము వారి అనుమతితో

బ్రాడీపేట, గుంటూరు
తేది : 14-02-2023

గోవిందరాజు సదానంద్
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

గమనిక : 1) ప్రత్యేక మహాజన సభకు సభ్యుల ప్రవేశము ఆధార్ కార్డుతో గాని, ఏదేని ఇతర గుర్తింపు కార్డుతో గాని మాత్రమే అనుమతించబడును.
2) కోవిడ్-19 ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ప్రత్యేక మహాజన సభకు సభ్యులను అనుమతించబడును.